# టేబుల్ టెన్నిస్ లో.. చరణ్ తేజ్ ప్రతిభ!



ఆదిలాబాద్ పట్టణానికి చెందిన కొమ్ము చరణ్ తేజ్ క్రీడల్లో సత్తా చాటుతున్నాడు. ఇటీవల స్విమ్మింగ్ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన ఆయన.. తాజాగా టేబుల్ టెన్నిస్ లో స్వర్ణ పతకం సాధించాడు. నిర్మల్ లో sgf ఆధ్వర్యంలో జరుగుతున్న పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించి ప్రశంసలు పొందాడు.

- ఈకాలం ఆదిలాబాద్ స్పోర్ట్స్







# బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఆలయాల అభివృద్ధి ప్రాధాన్యత

## జోగు ప్రేమేందర్..



**ఈకాలం న్యూస్ ఆదిలాబాద్ టౌన్:** ఆధ్యాత్మిక బాటలో పయనిస్తూ ప్రశాంత జీవనాన్ని గడపాలని మాజీ మున్సిపల్ చైర్మన్ జోగుప్రేమేందర్ అన్నారు. పట్టణంలోని శాంతినగర్ లో నూతనంగా నిర్మించిన శ్రీ శివ పంచాయతన సహిత అభయాంజనేయ స్వామి దేవాలయ విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలు వైభవంగా జరుగుతున్న నేపథ్యంలో వివిధ పూజాది క్రతువుల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటి నిర్వాహకులు ఆయనకు సాదరంగా స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు. అనంతరం విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలకు సంబంధించిన వివరాలను తెలియచేశారు. ఈమేరకు మాజీ మున్సిపల్ చైర్మన్ జోగుప్రేమేందర్ మాట్లాడుతూ... గత ప్రభుత్వ హయంలో ఆలయాల అభివృద్ధికి విశేష ప్రాధాన్యతను ఇచ్చినట్లు తెలిపారు. ఆలయాల నిర్మాణాలతో ఆధ్యాత్మిక భావన వెల్లివిరుస్తుందని పేర్కొన్నారు. భగవంతుడి కృపతో ప్రజలంతా సుభిక్షంగా జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భాస్కర్, చిన్న గంగారాం, రాజశేఖర్, అశోక్, రమేష్, మల్లయ్య, సాగర్, రవి, రాకేష్, హరీష్, కాలనీవాసులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఎథిక్ స్కూల్‌లో మట్టికళ అనుభవం

## విద్యార్థుల్లో సృజనాత్మకతకు ప్రోత్సాహం







**మంచిర్యాల:** మంచిర్యాల్ జిల్లా జన్మభూమి నగర్‌లోని ఎథిక్ అకాడమీ స్కూల్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన మట్టికళ (పాటరీ) అనుభవ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. సంప్రదాయ మట్టికళను విద్యార్థులకు పరిచయం చేస్తూ కళ, సంస్కృతి, అనుభవాత్మక అభ్యాసం సమ్మిళితంగా చేపట్టిన కార్యక్రమమిదని నిర్వాహకులు వివరించారు. ప్రొఫెషనల్ మట్టికళాకారుడు మార్గదర్శకత్వంలో విద్యార్థులు మన్నును స్పర్శించడం, మట్టిని మలచడం, చిన్న కుండలు, అలంకార వస్తువులు తయారు చేయడం వంటి ప్రక్రియలను అనుభవించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో సెన్సరీ లెర్నింగ్, సృజనాత్మకత, ఏకాగ్రత, సహనం, సూక్ష్మ నైపుణ్యాల అభివృద్ధికి అవకాశమొచ్చిందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు కూడా పాల్గొని మట్టి చక్రం వద్ద పాటరీ తయారీ అనుభవాన్ని పొందారు. దీంతో కార్యక్రమం మరింత ఆకర్షణీయంగా సాగింది. ఈ సందర్భంగా ఎథిక్ అకాడమీ స్కూల్ డైరెక్టర్ చరణ్ రెడ్డి మాట్లాడుతూ.. "పిల్లలు అనుభవం ద్వారా నేర్చుకోవడం అత్యంత ప్రభావవంతమైన విధానం. మట్టికళ వంటి కార్యక్రమాలు కళ, సంస్కృతి, జ్ఞానేంద్రియాల ఆధారిత అభ్యాసాన్ని ఒకే వేదికపై అందిస్తాయి. పిల్లలు, తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొనడం సంతోషకరం" అని తెలిపారు. ఈ కార్యక్రమం ముగిసిన అనంతరం విద్యార్థులు తయారు చేసిన మట్టికళాఖండాలను ప్రదర్శించారు. ఇవి వారి సృజనాత్మకతను ప్రతిబింబించే గుర్తులుగా నిలిచాయి.

# రోడ్డు భద్రత లక్ష్యం...

## అందరి సహకారంతో ప్రమాదాల నివారణ : సీపీ అంబర్ కిషోర్ ఝా

**మంచిర్యాల:** రోడ్డు ప్రమాద రహిత ప్రాంతం లక్ష్యంగా అన్ని శాఖలతో సమన్వయం చేసుకుని రోడ్డు ప్రమాదాలను నివారించే చర్యలను వేగవంతం చేస్తున్నట్లు రామగుండం కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. మంచిర్యాల జోన్ పరిధిలోని వేంపల్లి–ముల్కల బ్రిడ్జ్, గుడిపేట బ్రిడ్జ్‌తో పాటు ప్రమాదాలు చోటుచేసుకున్న ఇతర ప్రాంతాలను పరిశీలించారు. గతంలో ప్రాణనష్టం జరిగిన బ్లాక్ స్పాట్‌లను సందర్శించి, ప్రమాదాలకు దారితీసిన సాంకేతిక లోపాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అక్కడ స్పీడ్ బ్రేకర్లు, లైటింగ్, రంబుల్ స్టిక్స్, వేగ నియంత్రణ సూచికలు ఏర్పాటు చేయడంతో పాటు రాంగ్ రూట్ ప్రయాణాన్ని అరికట్టే చర్యలు తప్పనిసరిగా చేపట్టాలని సూచించారు. కమీషనరేట్‌లో తరచూ ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాల్లో రోడ్ సేఫ్టీ కమిటీలను ఏర్పాటుచేసి, శాఖల సమన్వయంతో కారణాలను గుర్తించి నివారణ చర్యలు చేపడుతున్నట్టు వెల్లడించారు. అతివేగం, బాధ్యతారహిత ప్రయాణాలు కుటుంబాలను విచ్ఛిన్నం చేస్తున్నాయని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరిస్తూ, మద్యం సేవించి వాహనం నడపకూడదని సూచించారు. చలికాలంలో మంచుతో రోడ్డుపై చూపు తగ్గే అవకాశాలున్నందున నెమ్మదిగా, జాగ్రత్తగా ప్రయాణించాలని విద్యార్థులకు సూచించారు. ప్రధాన రహదారులపై నిరంతర పెట్రోలింగ్ కొనసాగిస్తూ వాహనాలను రోడ్డుపై నిలపకుండా చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల డీసీపీ ఏ.భాస్కర్, ఏసీపీ ప్రకాష్, సీఐ అశోక్ కుమార్, రోడ్ సేఫ్టీ ఇన్స్పెక్టర్ రమేష్ బాబు, మున్సిపల్ కమిషనర్ తదితరులు పాల్గొన్నారు.



# పోలిసుల కుటుంబాలకు ఎల్లవేళలా అండగా ఉంటాం

## జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



**ఈకాలం, ఆదిలాబాద్:** బాధిత కుటుంబ సభ్యులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ పోలీసు సహాయ సహకారాలు అందిస్తామని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ హామీ ఇచ్చారు. శనివారం స్థానిక పోలీసు ముఖ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇచ్చోడా పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వర్తిస్తున్న హెడ్ కానిస్టేబుల్ ఎం.నాగేశ్వరరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా.... సదరు కుటుంబ సభ్యులను ఆహ్వానించి.. వారి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ద్వారా కార్పస్ ఫండ్ లో వచ్చిన రూ.లక్ష చెక్కును కుటుంబ సభ్యులకు అందించారు. ఎలాంటి సందర్భంలోనైనా జిల్లా పోలీసు యంత్రాంగం అందుబాటులో ఉంటూ సహాయ సహకారాలు అందిస్తుందని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ద్వారా వచ్చే లబ్ధి త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి బి.సురేందర్ రావు, పోలీసు కార్యాలయం సూపర్డెంట్ సులోచన, సిబ్బంది దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ ఆసుపత్రుల్లో పరిశీలనలు

## సిజేరియన్ కేసులపై ఆడిట్ ప్రారంభం

**మంచిర్యాల:** రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ సూచనల మేరకు జిల్లాలోని ప్రైవేట్ నర్సింగ్‌హోమ్‌లు, ఆసుపత్రులపై తనిఖీలు కొనసాగుతున్నాయి. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.అనిత ఆదేశాలపై ఈ పరిశీలనలో భాగంగా శ్రీలత ఆసుపత్రిని అధికారుల బృందం శనివారం తనిఖీ చేసింది. ఈ ఆసుపత్రిలో అక్టోబర్ నెలలో నమోదైన 40 ప్రసవాల్లో 38 సిజేరియన్‌లు (సి–సెక్షన్‌లు) జరగడం గమనించబడింది. ముఖ్యంగా మొదటి కాన్పులైన ప్రైమీ కేసుల్లో ఎందుకు అధికంగా సిజేరియన్‌లు జరిగాయో ఆడిట్ చేసి సంబంధిత వివరాలు సేకరించినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అప్పల ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రైవేట్ ఆసుపత్రులు గర్భిణులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని, అందిస్తున్న వైద్య సేవలు, వాటి ధరలను గోడపై స్పష్టంగా ప్రదర్శించాలని ఆదేశించినట్లు తెలిపారు. లేబర్ రూమ్‌లో సాధారణ ప్రసవాలకు సంబంధించిన వివరాలు ఉంచడం, ప్రతి గర్భవతికి కౌన్సెలింగ్ నిర్వహించడం, స్కానింగ్ వివరాలను నమోదు చేయడం, ఫార్మాసిస్టు ద్వారా మందుల విక్రయం జరగడం తప్పనిసరిగా ఉండాలని చెప్పారు. అదేవిధంగా వైద్యులు, సిబ్బంది వివరాలు, ఫోన్ నెంబర్లు గోడపై ఉంచాలని, సాధారణ ప్రసవం సాధ్యమయ్యేలా వైద్యసిబ్బంది సమయానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రైమీ సిజేరియన్ కేసులపై మొత్తం వివరాలు సేకరించి, తగిన నివేదిక జిల్లా కలెక్టర్‌కు పంపనున్నట్లు వివరించారు. జిల్లాలో సిజేరియన్ శాతం అధికంగా ఉన్న ప్రైవేట్ ఆసుపత్రులపై ప్రత్యేకంగా సి–సెక్షన్ ఆడిట్లు నిర్వహించేందుకు డాక్టర్ అరుణశ్రీ, డాక్టర్ అప్పల ప్రసాద్ నేతృత్వంలో కమిటీలు ఏర్పాటు చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.అనిత తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అప్పల ప్రసాద్, డాక్టర్ శివప్రసాద్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, ఆరోగ్య సిబ్బంది, శ్రీలత ఆసుపత్రి గైనకాలజిస్ట్ డాక్టర్ శ్రీలత, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.






# కాంగ్రెస్ సారథి ఖరారు..!

## ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడిగా డా.నరేష్ జాదవ్

## పార్టీ విధేయుడికి పట్టం కట్టిన పార్టీ అధిష్టానం

## పదవి ఆశించిన పలువురికి నిరాశ



**ఈకాలం, ఆదిలాబాద్:** కాంగ్రెస్ పార్టీ కి జిల్లా రథ సారథి ఎట్టకేలకు ఖరారయ్యారు. ఆదిలాబాద్ అధ్యక్షుడిగా మాజీ ఏఐ సీసీ సభ్యుడు డా. నరేష్ జాదవ్ ను నియమిస్తూ పార్టీ అధిష్టానం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఎప్పుడెప్పుడా అని ఎదురు చూసిన ఆ పార్టీ అధ్యక్ష పదవి ఖరారు కావడంతో ఇన్నాళ్ల సస్పెన్షన్ కు తెరపడినట్లయింది.మరోపక్క జిల్లాలో గత రెండేళ్లుగా కీలకమైన ఈ పదవి ఖాళీగా ఉంది. ఈ పదవిని దక్కించుకునేందుకు అనేకమంది ఆశావహులు పోటీ పడ్డారు. అధ్యక్షుల నియామకం కోసం ఆ పార్టీ అధిష్టానం జిల్లాల వారీగా ప్రత్యేకంగా పరిశీలకులను పంపించింది. వారు జిల్లాలో సుమారు వారం రోజుల పాటు ఇక్కడే ఉండి ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ప్రస్తుతం పార్టీ అధికారంలో ఉండటంతో జిల్లా వ్యాప్తంగా పలువురు నాయకులు కీలకమైన అధ్యక్ష పదవి కోసం పోటీ పడ్డారు. దరఖాస్తులు అందించడంతో పాటు పదవిని చేజిక్కించుకునేందుకు ఎవరికీ వారు తీవ్ర స్థాయిలో ప్రయత్నాలు చేశారు. కొందరు నాయకులు తరుచూ అధిష్టానం పెద్దలను కలుస్తూ పదవి వరించేలా ప్రయత్నం చేశారు. కానీ ఆ పార్టీ అధిష్టానం మాత్రం నరేష్ జాదవ్ కు అవకాశం కల్పించింది. దీంతో పదవి కోసం తీవ్రంగా ప్రయత్నాలు చేసిన పలువురు నాయకులు పదవి దక్కకపోవడం పట్ల తీవ్ర అసంతృప్తికి గురవుతున్నట్లు తెలుస్తోంది.

8688339954
ఈకాలం
The Perfect Telugu Daily వార్త




# శీతరం!



## ఆదిలాబాద్ లో కాంగ్రెస్ కు మనుగడ కష్టమే.

### *సమర్థులను పక్కకు పెట్టిన అధిష్టానం
### *క్యాడర్ పై పట్టులేనివారికి పట్టం
### *ఇక..పార్టీ కార్యక్రమాలు కూడా జరగడం కష్టమే..
### *"ఈవెంట్" లకు ఖర్చు చేసేవారికోసం దీపం పట్టాల్సిందే..

ఈకాలం ఆదిలాబాద్ : టిపిసిసి జనరల్ సెక్రెటరీగా ఉన్న ఇద్దరికీ, వైస్ ప్రెసిడెంట్ గా ఉన్న ఒకరికి ఉమ్మడి ఆదిలాబాద్ లో మూడు జిల్లాలకు డిసిసి పోస్టులు ఇవ్వడంపై సర్వత్ర చర్చ ప్రారంభమైంది. ఈ పోస్టుపై నమ్మకం పెట్టుకొని, ఇప్పటికే లక్షల రూపాయలు ఖర్చు చేసుకుని వేచి చూస్తున్న వారికి తాజా నియామకాలు చేదు అనుభవాన్ని మిగిల్చాయి. ఆదిలాబాద్ జిల్లా విషయానికి వస్తే.. పార్టీ ప్రకటించే ప్రతి కార్యక్రమాన్ని తూచతప్పకుండా నిర్వహించే కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి తోపాటు ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ కంది శ్రీనివాస్ రెడ్డి ఈ వెంట్లను విజయవంతం చేస్తూ వచ్చారు.

**- Devender N, Eekalam News**

తాజాగా డిసిసి పోస్ట్ ప్రకటించిన అభ్యర్థి నరేష్ జాదవ్ కు ఇలాంటి వ్యవహారాలపై పెద్దగా పట్టు లేకపోవడంతో అసలైన చర్చ ప్రారంభమైంది. అధిష్టానం ప్రకటించే ఎలాంటి కార్యక్రమమేనా పూర్తి చేయడానికి అవసరమయ్యే వనరులను సమకూర్చడంలో తాజా డీసీసీగా ప్రకటించిన అభ్యర్థి విఫలమయ్యే అవకాశాలున్నట్లు కనిపిస్తున్నాయి. ఈ విషయంలో kక్యాడర్ కూడా అసహనం వ్యక్తం చేస్తోంది. మొత్తంగా అనుభవజ్ఞులై ఉండి ఆర్థికంగా స్తోమత కలిగిన అభ్యర్థులను పక్కనపెట్టిన అధిష్టానం, తాజాగా ప్రకటించిన అభ్యర్థులు రానున్న రోజుల్లో పార్టీని ఏ మేరకు ముందుకు నడిపిస్తారో వేచి చూడాల్సిన అవసరం ఉంది.??

EEKALAM NEWS, Editor: Devender Nukala. RNI(PRGI)No.TGTEL/25/A3149